క్లుప్తంగా

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో ఆలయ పండితులు, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో కొలువు తీర్చి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం చేపట్టారు.

సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమేశ్వరంలో ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్మదా భాణ లింగ స్వరూప సంగమేశ్వరస్వామి వారికి భక్తులు విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సప్తనదీ జలాల్లో పుణ్యస్నానాలు చేసి ఆలయంలోని శివలింగానికి బిల్వార్చన నిర్వహించారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



భగవద్గీత పుస్తకాలను పంచుతున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవడం అలవర్చుకోవాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక చింతలపల్లి, ఆత్మకూరు కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మునిదాసు సూచించారు. సోమవారం దుద్యాల గ్రామంలో త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరమాత్మను చేరాలంటే భగవద్గీత ఒక్కటే మార్గమన్నారు.

వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, నాగరాజు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్ సోమవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబులకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు ప్రసాద్, జయన్న, తిమ్మయ్య, రాజేష్, వినోద్, సువర్ణమ్మ పాల్గొన్నారు.

సికారు పేటలో ఎక్సైజ్ సోదాలు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నందికొట్కూరు: పట్టణంలోని నీలిసికారి పేటలో ఎక్సైజ్ అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. ఇళ్ల మధ్యలో నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ రామాంజనేయులు నాయక్ మాట్లాడుతూ నాటు సారా తయారీకి దూరంగా ఉండాలని, పిల్లలను బాగా చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం యాదాద్రి జిల్లా భువనగిరికి చెందిన బి.రాజేంద్రప్రసాద్‌రెడ్డి రూ.1,00,293 విరాళాన్ని పర్యవేక్షకురాలు టీ.హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

మహానంది: ఉపాధి హామీ పథకంలో భాగంగా మంగళవారం మండలంలో మ్యాసివ్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ మల్లికార్జున సోమవారం తెలిపారు. 15 మంది రైతులకు చెందిన 29 ఎకరాల పొలాల్లో 608 కొబ్బరి మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు.

యూరియా దందా!

ఆత్మకూరు డివిజన్‌లో యూరియా దందా కొనసాగుతోంది. డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి ప్రైవేట్ దుకాణదారుల ద్వారా అధిక ధరలకు రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో ఎక్కడ కూడా యూరియా దొరకడం లేదు. అన్నదాతలు అప్పులు చేసిన అధిక ధరలకు ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తుండగా.. వ్యవసాయాధికారులు మాత్రం పుష్కలంగా యూరియా ఉందంటూ చెబుతుండటం గమనార్హం.

- కొత్తపల్లికి చెందిన పలువురు రైతులు ఇటీవల ఆత్మకూరులోని జీఎంఆర్, వసుంధర, మల్లికార్జునలతోపాటు ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాల చుట్టూ తిరిగినా యూరియా లేదన్నారు. ఇదే విషయాన్ని రైతులు ఆత్మకూరు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఏఓ హేమలత కలుగజేసుకున్న తర్వాత అది కూడా బస్తా రూ.266.50 చొప్పున దుకాణాదారులు యూరియాను రైతులకు ఇచ్చారు.

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న డీలర్లు, ప్రైవేట్ దుకాణాదారులు
- ఎమ్మార్పీ కంటే రూ.100 నుంచి రూ.150 వరకు అధికంగా విక్రయిస్తున్న వైనం
- యూరియాతో పాటు ఇతర ఎరువులు అంటగడుతున్న వ్యాపారులు



ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో దాదాపు 20 రోజుల తర్వాత వర్షాలు కురవడంతో మొక్కజొన్న, వరి, పత్తిపంటలు ఏపుగా పెరిగేందుకు యూరియా అవసరం. రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని దుకాణ యజమానులు సొమ్ము చేసుకునేందుకు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. యూరియాను ఎమ్మార్పీ ధరకు విక్రయించాల్సి ఉండగా అధిక ధరలకు రూ.366 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. యూరియాతోపాటు డీఏపీ, 28280, 143714, 20-20 0-13 తదితర కాంప్లెక్స్ ఎరువులు కొంటే తప్పా యూరియాను విక్రయించడం లేదు. ఆత్మకూరు పట్టణంలో ఆగ్రోస్, గ్రోమోర్‌తో పాటు పలు ప్రైవేట్‌దుకాణాల్లో యూరియా లేదని చెప్పడం, అధిక ధరకు లేదా, ఇతర ఎరువులు కొంటే తప్పా రైతులకు యూరియా ఇవ్వకపోవడం, జూపాడుబంగ్లా మండలం పారుమంచాల, పాములపాడు మండలం జూటూరు, కొత్తపల్లి మండల కేంద్రాల్లో యూరియా బస్తా రూ.400లకు పైగా రైతులకు అంటగడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రైతులు విధిలేని పరిస్థితుల్లో అధిక సొమ్ము చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

వ్యవసాయ మార్కెట్‌యార్డుకు క్యూ కట్టిన రైతులు

యూరియా, డీఏపీతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయనే సమాచారంతో రైతన్నలు ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ఆత్మకూరు మండలంతోపాటు, కొత్తపల్లి, వెలుగోడు మండలాలకు చెందిన రైతులు కూడా క్యూకడుతున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం వరకు వేచి చూడటం రోజూ వస్తున్న 10, 20 టన్నుల యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కొంత మంది రైతులకు దక్కుతుండటంతో మిగతా రైతులు చేసేదేమీ లేక తిరిగి ఇళ్లకు వెళ్తుండటం షరామామూలైంది.

ఎరువులు లేవంటున్నారు



ఆత్మకూరులో ఎన్ని దుకాణాలకు వెళ్లినా ఎరువులు లేవని వెనక్కి పంపుతున్నారు. ఇప్పటికే నాలుగైదు షాపులు తిరిగినా ఏ ఒక్క షాపులోనూ ఎరువులు ఇవ్వడం లేదు. కొన్ని చోట్ల యూరియా ఉన్నా యూరియాతోపాటు డీఏపీ లేదా 20-20-00 ఎరువులను కొనాలని చెబుతున్నారు.గ్రోమోర్ లాంటి కంపెనీలో యూరియా కావాలంటే నీళ్ల మందులు కొనుగోలు చేయాలని చెబుతున్నారు.

– వెంకటేశ్వర్లు, శివపురం గ్రామం, రైతు

ఎరువులు సరఫరా చేయాలి



ఎరువులు లేవని ప్రయివేట్ వ్యాపారులు చెప్పడం సరికాదు. వ్యవసాయ మార్కెట్‌యార్డులో కూడా రెండు, మూడు గంటలు లైన్‌లో నిల్చున్నా ఎరువులు దక్కడం లేదు. మూడు మండలాల రైతులు ఇక్కడికే వస్తుండటంతో ఉన్న ఎరువులు చాలడం లేదు. రైతుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఎరువులను సరఫరా చేయాలి.

– శ్రీనివాసులు, నల్లకాల్వ రైతు

కొరత లేదు

ఎరువల కొరత లేదు. ఇతర మండలాల రైతులు కూడా ఆత్మకూరుకే వస్తుండటంతో సమస్య అవుతుంది. ఇప్పటికే పలుచోట్ల ఎరువుల దుకాణాలకు యూరియాతోపాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు సరఫరా అయ్యింది. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. మార్కెట్‌యార్డుకు మరో 30 టన్నుల ఎరువు రానుంది. వాటిని కూడా రైతులకు సరఫరా చేస్తాం. ప్రయివేట్ వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే మాకు ఫిర్యాదు చేయండి.

– హేమలత, ఏఓ, ఆత్మకూరు

ఉపాధి కూలీల కనీస వేతనం రూ.307

వెలుగోడు: ఉపాధి కూలీలకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో కనీస వేతనం రూ.307గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. గుంతకందాల గ్రా మంలో సోమవారం సామాజిక తనిఖీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏటా వంద రోజుల పని కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ అచ్చమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

అనుమతుల్లేని మందులు విక్రయించొద్దు



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి

పాములపాడు: అనుమతుల్లేని విత్తనాలు, రసాయన మందులు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఇన్‌పుట్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీడ్ యాక్ట్ గురించి అవగాహన కల్పించారు. రైతులకు సరైన సమయంలో యూరియాను అందించాలన్నారు. యూరియా, ఇతర ఉత్పత్తులను ఎమ్మార్పీకి మించి విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

అలరించిన భజన



భక్తిగీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కడపకు చెందిన సీతారామాంజనేయ భజన మండలి వారి భజన కార్యక్రమం అలరించింది. గణపతి ప్రార్థన, లింగాష్టకం, శ్రీశైల సింహద్వారంలో, ఓం నమఃశివాయా, త్రిభువన పావనా దర్శనమివ్వవా, శివునిమెడలో నాగరాజా తదితర భక్తి గీతాలను, భజన కీర్తనలను ప్రతాప్, సాంబశివ, శశికళ, మాధవీలత, భారతి, భాగ్యలక్ష్మి తదితరులు ఆలపించారు. తబలా కె.హనుమంతు, హార్మోనియం సహకారాన్ని రాముడు అందించారు.

మహానందిలో మృత్యుంజయ హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో ఆషాఢమాసం, ద్వాదశి, సోమవారం పురస్కరించుకుని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు మహా మృత్యుంజయ హోమాలు నిర్వహించుకున్నారు. ఆర్జిత సేవా టికెట్లతో యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహా మృత్యుంజయ, రుద్ర, చండీహోమాలు నిర్వహించారు. అలాగే రాహుకేతు మండపంలో వేద పండితులు హనుమంతుశర్మ ఆధ్వర్యంలో భక్తులు రాహుకేతు పూజలు చేయించారు.

ఎరువులను అందజేయాలి

బండిఆత్మకూరు: రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు అందించాలని మండల సీపీఎం నాయకుడు డేవిడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎ.కోడూరులోని వ్యవసాయ సహకార సొసైటీ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.

కామేశ్వరీదేవి చీరలకు విక్రయ వేలాలు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు సోమవారం ఆలయ సూపరింటెండెంట్ ఎం.నీలకంఠరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్ టి.నాగమల్లయ్యల ఆధ్వర్యంలో విక్రయ వేలాలు నిర్వహించారు. సుమారు రూ.20 వేలకు పైగా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

సీఎం పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌పై ఆంక్షలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంలో మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ట్రాఫిక్‌పై ఆంక్షలు విధిస్తున్నట్లు టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చంద్రబాబు తెలిపారు. ఉదయం 11 నుంచి 11.35 గంటల వరకు సున్నిపెంట హెలిప్యాడ్ నుంచి శ్రీశైలం వరకు ట్రాఫిక్‌ను నిలిపేయనున్నట్లు చెప్పారు. ఉదయం 11.50 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు శ్రీశైలం డ్యాం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు. భక్తులు, యాత్రికులు సహకరించి ముందుగానే తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని సీఐ సూచించారు.

సమ్మెను జయప్రదం చేయండి

జూపాడుబంగ్లా: ఈనెల 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ వ్యకాస జిల్లా నాయకుడు కర్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తంగడంచ, మండ్లెం, పారుమంచాల గ్రామాల్లో సమ్మె కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికులు, శ్రామికులు, కౌలు రైతులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మెలో కార్మికులు, రైతులు, ఉపాధి కూలీలు భారీఎత్తున పాల్గొనాలని కోరారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఆత్మకూరు: అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని స్థానిక డీపాల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఫ్లిస్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అబ్దుల్ రహమాన్, మహమ్మద్‌జుబేర్, పి.ఉషారాణిలను సోమవారం అధ్యాపకులతో కలిసి అభినందించారు.

గుడిసె దగ్ధం

మహానంది: గాజులపల్లె గ్రామంలోని సచివాలయం-2 సమీపంలో నివాసం ఉంటున్న కుళ్లాయి గుడిసె దగ్ధమైంది. అనంతపురం జిల్లా గూగూడు కుళ్లాయ స్వామి దర్శనానికి కుళ్లాయి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఈక్రమంలో గుడిసె పైన విద్యుత్ లైన్ కిందికి ఉండటంతో నిప్పు రవ్వలు చెలరేగి గుడిసెకు మంటలు వ్యాపించినట్లు బాధితులు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఉచిత వైద్యం నిర్వహిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బైర్లూటీ వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని నల్లకాల్వ గ్రామంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు, చెత్తాచెదారం నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇళ్లల్లో డ్రమ్ములు, గచ్చుల్లో దోమలు పెరగకుండా చూసుకోవాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడాలని, మురుగునీరు నిల్వ ఉన్నచోట వెస్ట్ ఆయిల్ చల్లాలన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివకుమార్, భాస్కర్, పంచాయతీ కార్యదర్శి బాలనాయక్, సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

మండలానికి 2,351 మొక్కలు



లారీ నుంచి దించుతున్న కొబ్బరి మొక్కలు

పాములపాడు: రాజమండ్రి నుంచి మండల కేంద్రానికి సోమవారం 2,351 మొక్కలు వచ్చినట్లు ఏపీఎం అలివేలిమంగమ్మ తెలిపారు. 2,087 కొబ్బరి, 264 నిమ్మ మొక్కలు వచ్చాయన్నారు. ఎకరాకు 60 చొప్పున కొబ్బరి, 120 చొప్పున నిమ్మ మొక్కలను 29 మంది రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ముగిసిన సీఎస్ఐ చర్చీ ఎన్నికలు



విజయం సాధించిన టౌన్ సీఎస్ఐ పాలక వర్గం

నందికొట్కూరు: పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చీ పాలక వర్గానికి ఎన్నికలు ముగిశాయి. ఈ నెల 6న అర్ధరాత్రి వరకు పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ జరిగింది. ఓట్ల లెక్కింపు సోమవారం తెల్లవారు జాము వరకు జరిగింది. కాగా జనరల్ సభ్యులుగా ఫ్రాంచీస్ జయచంద్ర, ప్రదీప్, నాగేంద్ర, నాగేశ్వరరావు, రాజు, రమేష్, గిరీష్‌కుమార్‌లు విజయం సాధించారు. మహిళా సభ్యులుగా అంబమ్మ, శాంతకుమారి, ఏసుపాదమ్మ, యూత్ సభ్యులుగా బాలు మహేంద్ర, పవిత్ర గెలుపొందారు. త్వరలోనే టౌన్ సీఎస్ఐ చర్చీ సెక్రటరీని ఎన్నుకుంటామని సంఘ పెద్దలు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

నందికొట్కూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు ఆది మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. కనీసం తాగు నీరు లేక పోవడం దారుణమన్నారు. ఆర్‌ఓ ప్లాంటును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు శ్యామ్‌నాయక్, జగన్, అజయ్, సురేష్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామానికి చెందిన కాటెపోగు శ్రీనివాసులు(42) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, సర్పంచ్ కేశవరెడ్డి నాగార్జునరెడ్డి మృతుని కుమారుడు కాటెపోగు శివకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆధారాలతో ఫిర్యాదు చేయండి

జూపాడుబంగ్లా: అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో పేర్లు లేని రైతులు తగిన ఆధారాలతో రైతుసేవా కేంద్రాల్లో ఫిర్యాదు చేయాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులు మీసేవ కేంద్రాల్లో 15వ తేదీలోగా పంటల బీమా నమోదు చేయించుకోవాలన్నారు. 75 టన్నుల యూరియా, 187 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 20 టన్నుల డీఏపీ ఎరువులు మండలంలోని వివిధ దుకాణాల్లో అందుబాటులో ఉందన్నారు.

నేడు మహానేత జయంతి

ఆత్మకూరు: దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పావురాలగుట్ట పరిధిలోని నల్లకాల్వ గ్రామంలో ఉన్న వైఎస్సార్ స్మృతివనంలో మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మహానేత జయంతి సందర్భంగా ఉదయం 9 గంటలకు ఆత్మకూరులోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలతో నివాళులు అర్పిస్తామన్నారు. అనంతరం నంద్యాల టర్నింగ్ నుంచి వైఎస్సార్ స్మృతివనం వరకు బైకు ర్యాలీ చేపడతామన్నారు. అక్కడ వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

- వెలుగోడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం పట్టణంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన మొహర్రం





కొత్తపల్లి: ముసలిమడుగులో జలధి ఉత్సవానికి తరలుతున్న పీర్లు, మహానంది మండలంలో..

కొత్తపల్లి: మండలంలో మొహర్రం ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవా రం తెల్లవారుజాము వరకు జలధి ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జలధి ఉత్సవ ఊరేగింపులో భక్తులు పీర్లకు చక్కెర చదివింపులు చదివించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ జయశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వ హించారు.

- జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తంగడంచ, మండ్లెం తదితర గ్రామాల్లోని పీర్లను భక్తులు భక్తిశ్రద్ధలతో ఏటికి సాగనంపారు. ఆయా గ్రామాల్లోని పీర్లచావిడిలోని పెద్ద హుసేనాలం, చిన్నహుసేనాలం, హసన్, హుసేన్, అలీ, అక్బర్ పీర్లను ఎత్తారు. దర్గాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఏటికి తరలించారు. ఏటికి వెళ్లేసమయంలో పీర్ల స్వాముల పాద స్పర్శ తగిలితే రోగాలు మాయమవుతాయనే నమ్మకంతో భక్తులు రోడ్డుపై పడుకున్నారు. గ్రామానికి సమీపంలోని కాల్వలో పీర్లకు జలధి ఉత్సవం నిర్వహించిన ముస్లింలు.. విషాద గీతాలతో గ్రామానికి చేరుకున్నారు.



జూపాడుబంగ్లా: పీర్లదేవుళ్ల పాదస్పర్శ కోసం రోడ్డుపై పడుకున్న భక్తులు

- మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, గాజులపల్లె, బొల్లవరం, అబ్బీపురం తదితర గ్రామాల్లో మొహర్రం సందర్భంగా సోమవారం ఉదయం, సాయంత్రం పీర్ల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అనంతరం నిమజ్జనానికి పీర్లను తరలించారు.

అర్హుల జాబితాను సిద్ధం చేయండి

బండి ఆత్మకూరు: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితాను సిద్ధం చేయాలని మండల వ్యవసాయ అధికారులకు తహసీల్దార్ పద్మావతి సూచించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో మాట్లాడారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో మిగులు, ఇనామ్, డీ పట్టా భూములు కలిగిన రైతుల జాబితాను రెండురోజుల్లో ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

మహానందిలో వర్షం

మహానంది: మహానంది ఆలయ పరిసరాల్లో సోమవారం రాత్రి కొద్దిపాటి వర్షం కురిసింది. ఆలయ పరిసరాలతో పాటు పలు గ్రామాల పరిధిలో వరుణుడు అలా వచ్చి ఇలా పలకరించి వెళ్లినట్లు కొద్దిపాటి జల్లులు కురిశాయి. ఈ నెలలో ఆశించిన మేరకు వర్షపాతం నమోదు అవుతుందని భావిస్తున్న రైతులకు నిరాశే ఎదురవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



సహస్రదీపాలను వెలిగిస్తున్న ఆలయాధికారులు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్లకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

వెలుగోడు: మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధికార ప్రతినిధి బాషపోగు దరగయ్య సమితి జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగశేషులు, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, డాక్టర్ జాకీర్ హుస్సేన్ తదితరాలు పాల్గొన్నారు

మాదిగ దండోరా జెండావిష్కరణ

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో సోమవారం మాదిగ దండోరా జెండాను ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ ప్రేమురాజు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో సర్పంచు చింతల నారాయణ, మాజీ సర్పంచు హరిప్రసాద్, సమితి నాయకులు యువరాజ్, అబ్రహాం, బుడ్డన్న, అంకన్న, తప్పెట కళాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు